# 'దైవమిచ్చిన భార్య'

శకుంతల అంత పెద్ద అందమైందికాదు, కాని రాధాకృష్ణకి మాత్రం అనుకూలంగా నడచుకునేది. స్త్రీగా భర్తని ఎంత సంతోష పెట్టకలదో అంత సంతోషాన్ని యిచ్చేది. అంత ఆతని ప్రేమకీ పాత్రురాలయింది.

శకుంతలని రాధాకృష్ణ చాలాగొప్పగా చూసుకునేవాడు. హైస్కూల్లో మేష్టరు. అతని సంసారనౌక మార్గంలో తప్పితే యితర ప్రపంచ సాగరపు గాలివానలతో సంబంధం లేదు. ఏ సుడిగుండంలోనూ మునక్కుండా నడిపించాలని ఆతని ఆశయం, వాంఛా – అంతె చిన్నది.

రాధాకృష్ణకి ఆ వూరికి కొత్తగా బదిలీ అయింది. అదే అతని జీవితపథంలో కూడా మార్పు తెచ్చింది.

* * *

వీళ్ళింటికి పక్కగా ఎవరో చుట్టాలు వున్నారు. చుట్టరికమేమో చాలా దూరమయిందే. వ్యక్తులుమాత్రం సన్నిహితులు! తల్లితండ్రులూ, కూతురూను. కొంతవరకు ధనవంతులు. కూతురి పేరు పద్మావతి.

పద్మావతి రాధాకృష్ణకి వరసలు కలుపుకొంటే మరదలవుతుంది. పదహారేళ్ళున్నాయి. ఆ యేడే స్కూలుఫైనలు ప్యాసయింది.

తల్లేమో చదువు మానిపించి, పెళ్ళిచేసి, హాయిగా కాపురం చేసుకుంటూంటే చూడాలనుకుంది. తండ్రీ కూతుకి పై చదువులమీద కోరిక.—

పద్మావతి రాధాకృష్ణ యింటికి తరచు రాకపోకలు సాగించేది. చుట్టరికమేగాక, చదువుకున్నదైన మూలాన ఆమాత్రం స్వాతంత్రముంది.

పద్మావతికి వాళ్ళ దాంపత్యమంటే కొంత హేయంగా తోచేది. అంత చదువుకున్నవాడు ఆమెతో కాపురమేమిటని అనుకునేది. కొంచెం చనువయ్యాక రాధాకృష్ణ చదువురాని భార్యని పెళ్ళిచేసుకున్నందుకు విచారం తెల్పుతున్నట్టు జాలిగానూ సానుభూతిగానూ మాట్లాడేది.

ఆ మాటలు రాధాకృష్ణకి బాధగానూ, కష్టంగానూ వుండేవి. కాని పైకి ఏమీ అనలేకపోయేవాడు.

శకుంతల లేని సమయంలో, ఏ వంటదగ్గరో వున్నప్పుడు అందికూడా: "అక్కయ్య ఏమంత అందమైందికాదు. చదువుకోనిది. అది నీ దురదృష్టమనుకోను" అని. కళ్లల్లోంచి గర్వం వొలికేది. రాధాకృష్ణ తల వొంచుకునేవాడు.

"వివాహాలు స్వర్గంలో జరుగుతాయి!"

"అవును, నిజమే, మరి! ఏదో వొక ఆత్మ సంతృప్తి వుండొద్దూ?"

దెప్పేది, పెదివి విరిచేది.

"దాని అందంతోనూ, చదువుతోనూ పనిలేదు నాకు. చెప్పడానికి మాటలు చాలని గొప్పతన మేదో వుంది దానిలో"

"ఇంత చదువు చదివినా నీలో కొంచెం పిచ్చి లేకపోలేదు సుమీ?"

ఆ సంభాషణ ఆవేళటికి అక్కడ తెగిపోయింది.

మరోసారి పద్మావతి తను చక్కని లేసులతో అల్లిన రుమాలు బహుమతివ్వాలని తెచ్చింది. ఒక మూల రంగు దారాలతో అల్లిన 'పద్మ' అనే అక్షరాలున్నాయి.

"ఇది చూశావా? అందంగా లేదూ? అక్కకి ఇట్లాంటివేమీ తెలీవు!"

అతను మాట్లాడలేదు. రుమాలు అతని భుజంమీద వేసింది.

"అచ్చ మన్మథుడిలా వున్నావే?" అటూ ఇటూ తొంగిచూసింది. అతను పరవాన్నంలో ఈగని తీసినట్టు, తీసి పారేశాడు.

ఒక్కసారిగా పద్మావతి కళ్ళల్లోకి నీళ్ళువచ్చాయి. చప్పున, బల్లమీద వేసిన అతని చేతుల్ని పట్టుకుంది.

"వొద్దంటే, నన్ను కాల్చుకు తిన్నట్టే"

రాధాకృష్ణని కష్టపెట్టాలనుకుంది, మనసులో నొచ్చుకుని తీసుకున్నాడు, ఏమనలేక. 'ఇందులో పోయిందేమీ లేదు' అనుకుని,

* * *

రాత్రి శకుంతల అంది: "మీరు మారిపోతున్నారు, రోజు రోజుకీ" అని.

దెబ్బతిన్న లేడిలా అయ్యాడు. ఒకక్షణం నోట మాట రాలేదు. చివరకి అన్నాడు:

"దాని మాటేనా? బలవంతం చేసింది, తీసుకోమని"

కళ్ళల్లోకి చీల్చుకుని చూసింది, సత్యాన్వేషణ కోసం. చూపుల్నెదుర్కోలేక దృష్టి కిందకి మరల్చుకున్నాడు.

"మీ తప్పేమీ లేదులెండి" చప్పరించింది, 'మగాళ్లందరూ ఇంతే' నన్నట్టు.

శరీరాన్ని ముక్కలకింద కోసినా అంతబాధ పడి వుండడు, ఆ నిమిషంలో అంత బాధపడ్డాడు.

"పోనీలెండి! నేను ప్రేమకి కృతజ్ఞురాల్నిగా వుండగలిగితే నా కదేచాలు."

ఆత్మసంతృప్తి చెందింది.

"నా కేమన్నా నిజంగా దురుద్దేశముంటేఈ క్షణం నిలువుగా కాలిపోతాను" అంతకన్నా నమ్మకం చెప్పలేక పోయాడు.

శకుంతల దాన్ని మర్చిపోదామనుకుంది. కాని ప్రయత్నాలకి విరుద్ధంగా ఏదో బాధ లోపలి మనిషిని నమిలివెయ్యసాగింది. ఆ బాధ ప్రియుని అనాదరణకి పాత్రురాలైన స్త్రీ హృదయానికే తెలియాలి!

పద్మావతిని చదివించడానికే నిర్ణయించుకున్నారు వాళ్లవాళ్లు. చదువుకుందుకు పట్నం వెళ్ళింది, అది కొంత శాంతినిచ్చింది రాధాకృష్ణకి. శకుంతల లేశమైనా కష్టపడ్డం అతని వుద్దేశం కాదు.

ఇది జరిగిన సంవత్సరానికి శకుంతలకి పిల్లకలిగి, పురిటిలోనే మరణించింది అగ్నికితోడైన నెయ్యిలా-అది శకుంతలని మరింత కుంగదీసింది. ప్రాణం పోతున్నట్టుగా విలపించింది.

అదే పెద్ద మనోవ్యాధిగా మారి మంచంపట్టింది. అన్ని విధాలా సేవ చెయ్యసాగాడు రాధాకృష్ణ.

అప్పుడు సెలవలకని వొచ్చింది పద్మావతి.

ఒకసారి వీలు కలగజేసుకుని రాధాకృష్ణతో అంది: "దేవుడుకూడా కళ్లు మూసుకుని వుండలేడు. అసహజాన్ని ఎంతకాలమని సహిస్తాడు" అని.

కాని ఆ మాటల్లో వొట్టి హృదయరాహిత్యమే ధ్వనించిం దతనికి.

"పై మెరుగులు కొంతవరకు ఆకర్షించుతాయి. కాని ప్రత్యేకం అందాన్నే ప్రేమించరు మనుష్యులు. అంతకంటె లోపలి అగాధమైన శక్తేదో ప్రేమని పొందుతుంది. నాకు శకుంతలమీది ప్రేమ అనిర్వచనీయం."

అదే సమాధానంగా యిచ్చాడు. పద్మావతి నవ్వుకుంది. పైకే నవ్విందేమోకూడా. ఆ నవ్వు రాధాకృష్ణ అసహ్యాన్ని మాత్రమే పొందగలిగింది.

* * *

మళ్ళీ రోజులు దొర్లిపోయాయి. శకుంతల చావు వైపు తన గమనాన్ని సాగించింది రాధాకృష్ణ పరిస్థితులకు సమంగా సర్దుకుందుకు ప్రయత్నించాడు. చాతనయినంత వరకూ శకుంతలని వొదులుకోకుండా వుండడమే అతని ఆశయం, డాక్టర్లు వొస్తూ, పోతూన్నారు.

ఆర్నెల్లల్లో శకుంతల గమ్యస్థానాన్ని చేరుకుంది. ఆమె మరణానంతరం రాధాకృష్ణకి ఏదో వైరాగ్యం, శాంతస్వభావం అబ్బింది. శకుంతలకి తనేదో మోసం, అన్యాయం చేసినట్టనుకున్నాడు.

కాని ఆమె అతన్ని వొదిలిపెట్టి ముందుగా చావువైపు పరుగెత్తింది. అక్కడ తనకోసం కళ్ళు విప్పుకుని ఎదుకుచూ

స్తుంది, చేతులు చాచుకొని. ఇప్పటికి సత్యం తెల్సుకుని వుంటుంది. బహుశా పశ్చాత్తాప పడుతుంటుంది.

ఏదో స్కూలుకి వెడుతున్నాడు వస్తున్నాడేగాని, అది ఒక అలవాటుకింద మాత్రమే, నాలుగు నెల్లు గడిచాయి అట్లానే.

*　　　*　　　*

పద్మావతి ఇంటర్ పూర్తిచేసుకు వచ్చింది. ఇదివరకటి కంటె చాలా నాగరీకురాలయింది.

పరామర్శకని రాధాకృష్ణుని సందర్శించింది. అతని కళ్లు ఆలోచనలతో లోతుగా అయ్యాయి. జుట్టుకి సంస్కారం లేదు.

చాలా సంగతులు ఏవో చాలాసేపు మాట్లాడింది సానుభూతిపూర్వకంగా, అన్నిటికి అసంబంధంగా, ఆనాలోచితంగా, ముక్తసరిగా సమాధానాలు యిచ్చాడు.

"జరిగిందేదో జరిగింది. ఇప్పుడన్నా దారి సరిచేసుకో. కావలిస్తే నేను సహాయం చేస్తాను."

సంసిద్ధతని తెలీజేసింది, చీరకొంగు మెలివేస్తూ.

రాధాకృష్ణ లోపలే నవ్వుకుని కొంచెంసేపుండిఅన్నాడు.

"నీకు నేనెన్నిసార్లు చెప్పినా అర్థంకాదు. అంతకన్నా బాగా చెప్పగలగడం నా సాధ్యం కావడంలేదు. నాకు పిచ్చనుకో, ఏమనుకో, శకుంతల తన ప్రతిబింబంలో నా మనోఫలకాన్ని నింపేసుకుంది. ఆ నవ్వులు, ఆ మాటలు ఇంకా నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. అక్కడ మరి యితరానికి దేనికీ చోటులేదు.

"ఒకొక్కళ్ళ సహచర్యంలో మనం వ్యక్తుల్ని గాక లోపలి సత్యాన్ని దేన్నో ప్రేమిస్తుంటాం, అంతరాంతరాల్లో. దానిలో మామూలు ప్రేమ మర్యాదల్ని పోల్చలేం.

శకుంతల తన పాత జ్ఞాపకాలలో పలకరిస్తుంటుంది. మెలకువలో. నిద్రల్లో, అది బతికేవున్నట్టుంది. అది సామాన్యం వ్యక్తికాదు.

"ఒకమాటలో చెప్పమంటే దైవమిచ్చిన భార్య."

ముగించాడు. కంటినుండి వేడిచుక్క టేబిల్ మీద పడింది.

"మనం చేతులారా తెచ్చుకునే దురదృష్టం కొంత వుండక మానదు" అని నిస్పృహాలో కొసరింది, వెళ్ళిపోవడానికి లేస్తూ, పద్మావతి.

—(౦)—